# ప్రత్యక్ష రామాయణం

ఏ. వి. వి. జోగయ్యశాస్త్రి

(కవి మిత్రమండలి)

—. ౦ :—

౧

శ్లో॥ "హరేరామ హరేరామ । రామరామ హరేహరే
హరేకృష్ణ హరేకృష్ణ । కృష్ణకృష్ణ హరేహరే!"



తలుపు చప్పుడు. గున్నమ్మ చటాలున తొంగి చూచింది. చంకను చిన్నమూట—చేతిలో ఇత్తడి చెంబుతో—విభూతి పిండికట్లతో ఒక వ్యక్తి ప్రత్యక్షం.

"ఇప్పుడు చెయ్యేరుకోలేను. వెళ్లండి యాయవారానికైతే మాత్రం వేళాపాళా లేదూ?—ఏదీ కానివేళ గేదీనిం దన్నట్లు—ఇప్పుడేం ముష్టి? పదండి—పదండి. లోపల భోజనాలౌతున్నాయి" అని విసుక్కుంటూ వచ్చి తలుపు వెయ్యబోయింది.

"ఆఁ ఆఁ! ఏమిటమ్మా అది?- మంచీ చెడ్డా లేకుండా—మనిషి తాహతు తెలియకుండా. ఎవరో—ఎందుకు వచ్చేరో అగోడవేమీ అక్కర్లేనట్టుంది. చాలు—మంచి మర్యాదే! తిరిగి తిరిగి మంచి చోటికే వచ్చేను" అన్నాడు.

"అయ్యో! అయ్యో! నా మతిమండా! సరిగ్గా చూడకుండా అనేశాను. మరేమీ అనుకోకండి. భోజనానికి వస్తారా యేమిటి?—రండి—అన్నీ సిద్ధంగా ఉన్నాయి" అంది.

"పూటకి రేటెంత?—" అన్నాడు. ముందు తేల్చుకుంటే నయమని.

"మీరు వైదికులా? నియోగులా బాబూ?" అంది.

"ఏం?—మేం వైదికులం. మాది స్వయం కపి సగోత్రం మాది గోదావరీతీరం అమలాపురం. నాపేరు వెంకట శాస్త్రి. మా తండ్రిగారి పేరు పేరిసోమయాజిగారు. మా ప్రవరకూడా చెప్ప మంటావా యేమిటి?"—"చతుస్సాగర పర్యంతం—గో బ్రాహ్మణేభ్యః శుభం భవతు—"

"అయ్యో, ఎంత అప్రతిష్ట? మిమ్మల్ని పరీక్షిస్తున్నాననుకున్నారా యేమిటి?—ఉల్లిపాయ వేసిన వంటకాలు తింటారో తినరో అని అన్నాను. మరోలా గనుకోకండి—లేవండి. ఒక్క పావలామాత్రం యిప్పించండి—" అంది గున్నమ్మ.

వెంకటశాస్త్రి మూట క్రింద బెట్టి అందులోని సంచి తీసి డబ్బులు లెక్క పెట్టి యిచ్చేడు. సంచీలో రూపాయిలు గలగల లాడుతూన్నంతసేపూ గున్నమ్మ చెవులు మెదులుతూనే ఉన్నాయి. వెంకటశాస్త్రి స్నానంచేసి భోజనానికి కూర్చున్నాడు.

*    *    *    *

"పప్పు లేదూ? ....."

"ఇప్పుడే అయిపోయింది.—ఉల్లిపాయల పులుసుంది—"

"రామరామ ఆవకాయి లేదూ?—"

"కొంచెం వాసన కొడుతున్నది. వెయ్యమంటే వేస్తాను"

"పోనీ వడియం ముక్కైనా?. . "

"ఇప్పుడే నిప్పు లార్పేశాను—వేయించడం ఏలాగ మరి?—"

"సరే!—మజ్జిగ యింత బాగుందే?—"

"ఈవేళ గొల్లగి దగా చేసింది. రాలేదు—ఏదో ఉన్న కాడికి కాస్త సుఖంగా తినండి బాబూ!—"

*    *    *    *

వెంకటశాస్త్రి అంటే సామాన్యుడు కాడు. పెంకఘటం. కొద్దిగా చదువుకున్నా భేషజం యెక్కువ ఎంత పండితుడైనా అతనియెదుట తృణప్రాయుడు. చతురంగపు యెత్తులు యెత్తడంలో అతని కాతడే సాటి. ఏదో ఆకలి చల్లార్చుకున్నాడే కాని—పరాభవాగ్ని చల్లారలేదు.

అతడు మొదటినుంచీ గున్నమ్మ వైఖరి చూస్తున్నాడు. ఆమెలో సువాసినీ లక్షణాలకన్న వితంతు చిహ్నాలే యెక్కువగా ఉన్నాయి. ఆమెకు తోడు యింట్లో యెవ్వరూ కనిపించరు.

"పాపం! భోజనం మీకు సనిపడింది కాదు. కాస్సేపు అలాగ మంచంమీద విశ్రమించండి. చాలా యెండగా ఉంది. నేనూ క్షణంలో యిల్లు కడుక్కు వస్తాను" అంది.

"మంచం ఎందుకు? ఈలాగ చాపమీద ఒక్కక్షణం వాలేనంటే కాస్త బడలికం తీరుతుంది. మీ ధర్మమా అంటూ ఏదో కాస్త ప్రసాదం పారేశారు."

"అలా కాదు. నామాట కాస్త వినండి. గ్రామం మంచిది కాదు ఆ మూట తలక్రింద పెట్టుకు పడుకుంటే ..... ఏం ప్రమాదం వచ్చినా .. బాగుండదు. దానినిలాగ తెండి మీరు హాయిగా పడుండండి. దాన్ని నే జాగ్రత్త చేస్తాను" అంది. ఎంతో సాదరంగా.

వెంకటశాస్త్రిలు గది కేసి చూచేడు. చుట్టూ పటాలు అన్నీ రామాయణాది పురాణాలకు సంబంధించినవే! ఎదురుగా రాధాకృష్ణుల విగ్రహాలు పూలదండలతో అలంకరింపబడి బల్లమీద ఉన్నాయి. జాలరు వేసిన రెండు పందిరి పట్టె మంచాలు ఎదురెదురుగా ఉన్నాయి. వాని మీద తెల్లని దుప్పటీలు—మెత్తని తలదిండ్లూ ఉన్నాయి, ఇదంతా చూచేటప్పటికి వెంకటశాస్త్రి కాశ్చర్యం వేసింది. సరే! ముందు సంగతి చూద్దామని ఒక మంచం మీద వ్రాలి క్షణంలో గుఱ్ఱుపట్టి లోకాన్ని మరచి నిద్రపోయేడు.

## ౨

నిద్రనుంచి లేచేటప్పటికి గున్నమ్మ తల ఆర విప్పుకుని యేదో పుస్తకం చదువుకుంటోంది. పుస్తకం కేసి చూచేడు—"కళ—" అనే అక్షరాలు మాత్రం సగం సగం కనిపించేయి. ఆ పుస్తకం ఏదైనా—'పాకకళ'కు సంబంధించినదా? లేక కళాశాస్త్రం లాంటిదా? అని తర్కించుకున్నాడు. అంతు దొరక లేదు. అతన్ని చూచి పుస్తకం మూసి—

"లేచేరా?—" అంది.

"ఆఁ!—మూట యిస్తే వెళ్లిపోతాను. చల్లబడింది. చాలాదూరం వెళ్లాలి" అన్నాడు.

"సరే! మూటకేం యిస్తాను. ఈవేళ ఏకాదశి రాత్రి జాగరణం చెయ్యాలి. మీ వైఖరి చూస్తే గొప్ప విద్వాంసులాగ కనబడుతున్నారు. పాపం మీకు మధ్యాహ్నం భోజనం కుదిరింది కాదు. రాత్రి భోజనం చేసే వంటా—ఫలహారం చేస్తే ఉప్పుపిండీ తయారుచేస్తాను. ఏదో కాస్త సత్కాలక్షేపం చేయండి—" అంది.

*    *    *    *

"నడివయస్సులో ఉన్న వితంతువు—వృత్తా పూటకూళ్ల వృత్తి. చదివేదా కళాశాస్త్రం. బలే—యీావిడ

ఏకాదశి ఉపవాసాలూ జాగరణాలూ చేస్తుందట. ఈ వింతేమో చూడాలి" అనుకుని మూట అందుకున్నాడు. మూట తేలికగా కనుపించింది. లోపల సంచీ చూసేడు. దులిపేడు. ఏముంది? అంతా శూన్యం. ఆతని ముఖం తెల్లబోయింది. తలలో అనేక భావతరంగా లుత్పన్న మయేయి. అంతలో ధైర్యం తెచ్చుకుని యేలాగైనా యీ ముండని సాధించి తీరాలని భావించుకున్నాడు.

*    *    *    *

"ఏం?—వెడతారా? ఉంటారా?—"

"పోనీ ఉంటాను యీ రాత్రికి—"

"రామాయణం చెప్పండి—"

"ఏ రామాయణం—?"

"అంటే?—"

"యథార్థ రామాయణమా?—అబద్ధ రామాయణమా?—ప్రత్యక్ష రామాయణమా?—పరోక్ష రామాయణమా?—"

"సరి. చాలారకా లున్నాయి. యథార్థ రామాయణం ఎవరో దాసుగారు చెబుతే విన్నాను. మీ ప్రత్యక్ష రామాయణం యేమిటో మాత్రం తెలియదు."

"అది చెప్పడమనేది చాల కష్టం. ప్రత్యక్షంగా కళ్లకి కనుపించేలాగ చెయ్యాలి. ఏ పండితుడూ ఇదివరకు చెప్పి ఉండడు. సరే—మీకు దానినే వినాలనే కోరిక ఉంటే పోనీ చెబుతాను—" అన్నాడు.

"ఇంతకంటేనా?—మహాత్మా!—" అంగి వినయా న్నభినయిస్తూ.

## 3

గున్నమ్మ గది అంతా శృంగారించింది. వెంకటశాస్త్రి చెప్పినట్లుగా ఎదురెదురుగా రెండు మంచాలు వేసింది. పూజాద్రవ్యాలన్నీ సిద్ధపరిచింది. శ్రీరామపటా న్నలంకరించి ఒక మూల కుర్చీలో ఉంచింది. తన స్నేహితురాండ్రని—'ఈవేళ మాయింట ప్రత్యక్ష రామాయణం జరుగుతుంది. రావలసిం" దని తీసుకు వచ్చింది. వెంకటశాస్త్రి ఆచోకీ అంతా యిదివరకే తీసుకొని జాగ్రత్తలో ఉన్నాడు.

గున్నమ్మ స్వయంగా శాస్త్రిగారికి చందనం పూసి—పూలదండలు వేసింది. ఒక మంచంమీద కూర్చుని వెంకటశాస్త్రి—"గజాననం భూతగణాధిసేవితం। కపిత్థ జంబూ ఫలసార భక్షణం—" అంటూ గణాధిక స్తుతి చేసి—యిష్టదేవతా ప్రార్థన గావించి కథ నుపక్రమించేడు. ముందర ప్రస్తావనలో సకల కామితార్థ ప్రదమైన సుందరకాండ చెప్పబోతు ఉన్నానన్నాడు. ముసుగు బుఱ్ఱ లూపుతూ సభ్యురాండ్రందరూ సంతోషించేరు. కథ నడుస్తోంది.

—"ఆ ప్రకారంగా శ్రీరామచంద్రులవారి ఆజ్ఞానుసారంగా అంగద జాంబవదాదులైన కపివీరు లందరున్నూ—కూడా దక్షిణ వారాశి సమీపించినటువంటివారై—ఏమి చేయుటకున్నూ తోచక—కర్తవ్యతా విమూఢులైనటువంటివారై ఉండే సమయమున—వృద్ధులైనటువంటి జాంబవంతులవారు ఆంజనేయస్వామి వారియొక్క అఖండమైనటువంటి బలసంపదను వేనోళ్ల పొగడి నటువంటివారై—ఆ మహా బలశాలిని వారాశి దాటుటకు తగిన ఉత్సాహ శక్తులు గలవానిగా జేసి నటువంటివారైనారష—" అని శ్రీరాగవరుసని చెబుతూ ఏదో మరచిన వాడిలాగ గున్నమ్మ కేసి చూచేడు వెంకటశాస్త్రి.

"ఏమండి, ఊరుకున్నారేం?—" అంది గున్నమ్మ ఆతృతతో.

"ఇక్కడ ఆంజనేయ స్వామివారు సముద్రాన్నుల్లంఘించే ఘట్టం. సీతామ్మవారి కానవాలుగా శ్రీరాములవారిచ్చిన ముద్రికను శిరమున దాల్చిగాని సముద్రం దాటడు. ముద్రిక లేకుంటే కథ అడ్డుపడుతుంది. యథావిధిగా కావాలంటే అది వుండాలి. లేకుంటే—యేదో మొక్కుబడిగా కానిస్తా" నన్నాడు.

"అయ్యో! కక్కుర్తెందుకండీ?—ఇది పని కొస్తుందేమో చూడండి—" అంటూ తలవ్రేలినున్న తుల మొత్తు మేలిమి ఉంగరం అందించింది.

"ఓ! దివ్యంగా పని కొస్తుంది—" అంటూ అందుకున్నాడు.

"జాగ్రత్త సుమండీ—" అంది గున్నమ్మ

"అది నే నెరగనూ?—డబ్బుతో పని—" అంటూ దానిని కళ్ల నద్దుకుని జంద్యాన్ని ముడేసుకున్నాడు.

సభ్యురాండ్రందరూ ముందు కథకోసం ఉత్సాహంగా చూస్తున్నారు. వెంకటశాస్త్రి పంచి యెగకట్టి—ఉత్తరీయం బిగించి—వ్యాసపీఠం చేత్తో పుచ్చుకుని మంచంమీద నిలుచుండి,

—"ఆ ప్రకారము ముద్రికను దాల్చి నటువంటివారై హనుమానులవారు శ్రీరామ సంస్మరణము చేసికుంటూ



న్నటువంటివారై—చిన్నపిల్ల కాలువ దాటినట్లుగా యీ తీరాన్నుంచి లంకలోని కీ విధంగా దూకినారట—" అంటూ యీ మంచంమీదనుంచి ఆ మంచంమీదికి గభీమని ఒక్క దాటు దాటేడు. ఆ దెబ్బతో పందిరి విరిగి ముక్కలై క్రింద పడింది. ప్రక్క నున్న ఒకటి రెండు పటాలుకూడా బ్రద్దలయేయి.

"ఆఁ ఆఁ! అదేంపనయ్యా!—" అంటూ వచ్చి గున్నమ్మ అడ్డగించుకో బోయింది.

—"ఆ ప్రకారము సముద్రమును దాటి లంకలో ప్రవేశించుచుండగా—లంకిణి వచ్చి అడ్డగించుటతోడనే—మిక్కిలి కోపోద్దీపిత మానసు లైనట్టువంటివారై—చేతిలోని గదాదండంతో యీ ప్రకారం ఒక్క ప్రహా



రణం ప్రసాదించి నటువంటివాడై రక్ష—" అంటూ వ్యాసపీఠం పుచ్చుకుని గట్టిగా గున్నమ్మ నెత్తిమీద ఒక్క—దెబ్బ కొట్టి—

"ఈ ప్రకారం కోటగోడ దాటి లోన ప్రవేశించినా రక్ష—" అంటూ దొడ్డి గోడ దూకి పలాయన మంత్రం పఠించేడు.

అంతా ఒక్క—సారి గొల్లుమన్నారు. ఆ దెబ్బతో—

"ఓరి నీ మొహం మండా! ఎంత దెబ్బ కొట్టేవురా నక్క—మాలినవాడా!" అంటూ క్రింద పడిపోయింది గున్నమ్మ. అమ్మ లక్క—లందరూ కాళ్లకి బుద్ధి చెప్పేరు.

ఆ కౌపచీకట్లో వెంకటశాస్త్రి జాడ యెక్క—డ తెలుసుంది! వెంకటశాస్త్రి తనవి పదిరూపాయిలు పోయినా సాతిక గిట్టే యనుకున్నాడు. గున్నమ్మ ఆ దెబ్బ తిని అను లంఖణాలు చేసింది.